క్లుప్తంగా

విద్యార్థులకు సంగీతంపై శిక్షణ

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని కెల్ల వీధిలో ఉన్న హోసన్నా మినిస్ట్రీస్ చర్చిలో విద్యార్థులకు సంగీతంపై శిక్షణ అందిస్తున్నట్లు పాస్టర్ థామస్ శుక్రవారం తెలిపారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా వారం రోజులుగా వస్తున్న చిన్నారులకు సంగీతం నేర్పిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీసేందుకు ఈ తరగతులు ఉపయోగపడతాయన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ

విజయనగరం గంటస్తంభం: నగరంలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. వేసవి సెలవుల్లో పిల్లలకు విజ్ఞానం, వినోదం అందించే కార్యక్రమాలు అందజేశామని జేవీవీ సమత రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల తెలిపారు. శిక్షణా కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు అందజేశామన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ స్వగృహంలో జరుగుతున్న వాగ్దేవీ బాల సంస్కార్ శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. అనంతరం పిల్లలతో భగవద్గీత శ్లోకాలు పఠనం చేయించారు. ఆ తర్వాత సుమతీశతక పద్యాలు వల్లె వేయించారు. భగవద్గీత గొప్పతనాన్ని సంస్థ వ్యవస్థాపకురాలు పెన్నేటి స్వప్న హైందవి వివరించారు. భగవద్గీత.. మోక్షప్రదాయిని అని, భగవద్గీత చదివిన వారికి తప్పకుండా మోక్షం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్త సాహితి, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్.గురుప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: కలెక్టర్ కార్యాలయం సహా కలెక్టరేట్ ఏరియా, ఎస్పీ కార్యాలయం, పోలీస్ బ్యారెక్ ప్రాంతాల్లో ఈ నెల 18వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. కలెక్టరేట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

రక్తదానం

నెల్లిమర్ల: గోషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ గర్భిణికి ఎబి పాజిటివ్ రక్తం అత్యవసరమైంది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు సాధన యువజన సంఘాన్ని సంప్రదించారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న జరజాపుపేట సంతోషిమాత ఆలయ అర్చకుడు వంశీ రక్తదానానికి ముందుకువచ్చారు. స్థానిక ఎన్వీఎన్ బ్లడ్‌బ్యాంకుకు శుక్రవారం వెళ్లి, రక్తం దానం చేసి గర్భిణి బంధువులకు అందజేశారు. సదరు అర్చకుని మానవత్వానికి గర్భిణి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.


ఉచిత నాట్య శిక్షణ తరగతులు



శిక్షణలో నాట్యం నేర్చుకుంటున్న విద్యార్థులు

నెల్లిమర్ల: స్థానిక పట్టణంలోని మిమ్స్ సమీపంలో ఉన్న శ్రీరామకృష్ణ ధ్యానమందిరంలో విద్యార్థులకు ఉచితంగా నాట్య శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యదర్శి జగన్నాథరాజు శుక్రవారం తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. పిల్లలను తరగతులకు పంపించాల్సిన వారు ఫోన్ నంబర్లు 9440334589, 7013450824ను సంప్రదించాలని కోరారు.

'పోలీస్ వెల్ఫేర్ డే'



ఏఎస్ఐ లక్ష్మణరావు వినతిపత్రం తీసుకుని మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టగా, సిబ్బందిని ఒక్కొక్కరిగా ఎస్పీ తన చాంబర్‌లోకి పిలిపించుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకుని, వినతులు స్వీకరించారు. పోలీసుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎస్పీ తెలిపారు.

ప్రజాప్రతినిధులపై ..
చిన్నచూపు తగదు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు



ఉపాధి అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ తమ్మునాయుడు

పినతాడివలస, అక్కివరం సర్పంచ్‌ల మధ్య వాగ్వాద దృశ్యం

డెంకాడ: గ్రామస్థాయిలోని ప్రజాప్రతినిధులను అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, ఇది సరికాదు అని వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, పలువురు సభ్యులు ఖండించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. తొలుత ఉపాధి హామీ పథకం పనుల వివరాలను ఏపీవో రవిబాబు వెల్లడించారు. ఈ సమయంలో సదరు వైస్ ఎంపీపీ కలుగజేసుకుని, ఉపాధి పథకం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజాప్రతినిధుల తీర్మానాలు విస్మరించి మరీ అధికారులు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు ఇదే తీరు కొనసాగిస్తే మండల సమావేశాలను బహిష్కరించాల్సి వస్తుందన్నారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకుంటూ గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధులను కూడా గౌరవించి, ప్రోటోకాల్ ప్రకారం వారిని ఆహ్వానించాల్సిన కార్యక్రమాలకు ఆహ్వానించాలని సూచించారు. రెవెన్యూ సేవలు అంత బాగా లేకపోవడంపై ఎంపీపీ వాసుదేవరావు, పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావులు ప్రశ్నించిన దానికి బదులుగా తహసీల్దారు పద్మావతి మాట్లాడారు. మండలంలో ఏడుగురు మాత్రమే వీఆర్వోలు ఉన్నారని, గ్రామ సర్వేయర్లు కూడా భూసర్వేలో ఉన్నారన్నారు. కొంతమంది డిప్యుటేషన్‌పై వెళ్లడంతో సిబ్బంది కొరత ఉందని, దాని కారణంగా కొన్ని సమస్యల పరిష్కారానికి సమయం పడుతోందన్నారు.

కాసేపు రసాభాస..

సమావేశం మధ్యలో కాసేపు రసాభాస చోటుచేసుకుంది. పినతాడివాడ సర్పంచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా పోలీస్‌స్టేషన్ నుంచి స్మశానవాటిక వరకు కొంత సీసీ రోడ్డు నిర్మాణం జరిగిందని, అయితే ఆ నిర్మాణం నాణ్యంగా లేదని మండల ఏఈ రమేష్‌ను నిలదీశారు. నిర్మాణానికి ముందు గ్రావెల్‌తో లెవల్ చేయకుండా నిర్మాణం చేపట్టారని, దీంతో రోడ్డు ఎత్తుపల్లాలు కలిగి ఉందన్నారు. సదరు రోడ్డు కాంట్రాక్టరుకు బిల్లు చెల్లించడానికి వీల్లేదన్నారు. ఇదే వాదన సమయంలో అక్కివరం సర్పంచ్ కంది కిరణ్‌కుమార్ కల్పించుకుని సమయం మొత్తం మీరే మాట్లాడితే మిగిలిన సభ్యులు ఏం మాట్లాడాలని ప్రశ్నించారు. వారిద్దరి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఆ తర్వాత కాసేపటికి మిగతా సభ్యులు వారిద్దరినీ వారించడంతో గొడవ సద్దుమణిగింది. సమావేశంలో వైస్ ఎంపీపీ కూరాకుల అనిత, ఎంపీడీవో భవాని, తహసీల్దారు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'బీట్ ది హీట్'తో వేసవితాపం నుంచి ఉపశమనం

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బీట్ ది హీట్ కార్యక్రమం ద్వారా ప్రజలు, ఇతర జీవులకు వేసవితాపం నుంచి ఉపశమనం కలిగించే చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇదే విషయమై శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన..మండుటెండల నుంచి సర్వప్రాణులను కాపాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పుడు పక్షుల దాహం తీర్చేందుకు చెట్లు, భవనాలపై మట్టిపాత్రలు, పశువుల దాహార్తి తీర్చేలా పలుచోట్ల నీటితొట్టెలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే వాహన చోదకుల కోసం సిగ్నల్ పాయింట్ల వద్ద నీడ ఏర్పాటయ్యేలా నెట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం శ్లాబ్‌పై ఎకో కూల్డ్ రూఫ్ టెక్నాలజీ వినియోగించి, తెల్లని పెయింటింగ్ వేయించామన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు విరివిగా నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మిద్దె పంటలు కూడా పెంచుకుంటే ఉష్ణతాపం నుంచి రక్షణ పొందగలమన్నారు.

పారిశుద్ధ్య పనుల అడ్డగింత



కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని 9వ వార్డులో ప్రధాన రోడ్డులో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పలువురు కౌన్సిలర్లు శుక్రవారం అడ్డుకున్నారు. ఆ పనులు చేపడుతున్నందుకు గాను కమిషనర్ తారక్‌నాథ్‌పై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము వద్దని చెప్పినా ఎందుకు చేపడుతున్నారని నిలదీశారు. దీంతో కమిషనర్‌కు, కౌన్సిలర్లకు మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిషనర్ పారిశుద్ధ్య పనులు చేయిస్తుండగా, కౌన్సిలర్లు బూర సుజాత, కారుకొండ కృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, కౌన్సిలర్ ప్రతినిధి చిక్కాల రవి, బైరెడ్డి కల్యాణ్ తదితరులు పనుల వద్దకు చేరుకుని, పనులు జరగకుండా అడ్డుకున్నారు. వెంటనే పనులు నిలిపివేయాలని కమిషనర్‌ను డిమాండ్ చేశారు. కాలువల్లో పూడికలు మాత్రమే తొలగించాలని, కాలువలపై ఉన్న పలకలు తొలగించవద్దని కమిషనర్ సిబ్బందికి తెలిపారు.

రాష్ట్ర మహాసభలకు సమాయత్తం



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి

విజయనగరం అర్బన్: కడపలో జూలై నెలలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర మహాసభల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని ఆ దిశగా అన్ని జిల్లా కమిటీలను సమాయత్తం చేస్తున్నామని జేవీవీ వ్యవస్థాపకులు వి.బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన జేవీవీ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి రాష్ట్ర నాయకత్వం వహించేందుకు చాలామంది నాయకులు ఉన్నారని, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పాఠశాలల్లో, గిరిజన గ్రామాల్లో అనేకానేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించిన చరిత్ర జిల్లా కమిటీకి ఉందని ప్రశంసించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాగా పేరొందిన ఈ జిల్లాలో కమిటీ బలోపేతం అవసరమన్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ ఈ నెల 25న ఉమ్మడి విజయనగరం మహాసభలు నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో పార్వతీపురం జేవీవీ నాయకులు రంజిత్‌కుమార్, దాలినాయుడు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ రామారావు

డెంకాడ: మండలంలోని మోదవలస గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని మాజీ సర్పంచ్ కనకల రామారావు కోరారు. ఇదే విషయమై ఆయన.. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీడీవో భవానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మోదవలస ఎన్‌హెచ్–26 రోడ్డు నుంచి గొండయ్యపాలెం మీదుగా మోదవలసకు రోడ్డు నిర్మాణం చేయాలని, ఎన్‌హెచ్–26 నుంచి వల్లూరు మీదుగా బంగార్రాజుపేటకు తారురోడ్డు మంజూరు చేయాలన్నారు. గ్రామంలో గతంలో ఎయిడెడ్ పాఠశాల ఉండేదని, దానిని తొలగించారని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మోదవలస సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు మధ్యలోనే ఉండిపోయాయని, వాటి పూర్తికి నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలాన్ని పరిరక్షించి దాని చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు.

శిక్షణ తరగతుల షెడ్యూల్ మార్చాలి

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం)ల్లో పనిచేస్తున్న బోధన సిబ్బందికి ఇవ్వనున్న బోధన సామర్థ్య పెంపు శిక్షణా తరగతులను తాత్కాలికంగా వాయిదా వేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు కోరారు. ఈ మేరకు ఆయన విజయవాడలోని కేజీబీవీ డైరెక్టర్ దేవానందరెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బోధన సిబ్బందిలో అధిక శాతం మంది డీఎస్సీ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని, వారి ప్రిపరేషన్‌కు అంతరాయం కలగకుండా శిక్షణా తరగతుల షెడ్యూల్‌ను మార్చాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలిస్తామని డైరెక్టర్ తెలియజేసినట్లు పీఆర్‌టీయూ మీడియా ఇన్‌చార్జ్ బంకపల్లి శివప్రసాద్ తెలిపారు.

'కొండంత' ఆక్రమణలు



నెల్లిమర్ల మండలంలోని సీతారామునిపేట కూడలి నుంచి గిరి ప్రదక్షిణ రోడ్డులో బోడికొండ చుట్టూ ఆక్రమణలు జోరందుకున్నాయి. కొండను తొలిచి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. జగనన్నకాలనీ మొదలుకుని కొండ శిఖర భాగం వరకు ఆక్రమణలు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. బోడికొండ చుట్టూ ఆక్రమణలకు అడ్డుకట్టవేయాలని కోరుతున్నారు. – నెల్లిమర్ల రూరల్

ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి

విజయనగరం అర్బన్: విద్యారంగంలో బోధన, బోధనేతర అంశాలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా విద్యాశాఖ అధికారులు ఏకపక్షం నిర్ణయాలు తీసుకుంటున్నారని ఈ వైఖరి మారాలని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తొమ్మిది రకాల పాఠశాలల వల్ల భవిష్యత్‌లో నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. గతంలో మాదిరిగా యూపీ, ఉన్నత పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రైమరీ స్కూళ్ల హెచ్ఎం పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లతో కాకుండా ఎస్జీటీల పదోన్నతులతో భర్తీ చేయాలని కోరారు. బదిలీల ప్రక్రియలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా స్కూళ్లను ఎంపిక చేసుకోవడం కష్టమని, మాన్యువల్ విధానంలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయుడు తదితరులు ఉన్నారు.

పక్కాగా వివరాల నమోదు



సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల శతశాతం పూర్తికి ఆర్‌సీహెచ్ఎంఎస్ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి అన్నారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్ స్టాఫ్‌తో శుక్రవారం సమావేశమై, పోర్టల్ వినియోగం, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. నెలవారీ నివేదికల వివరాలు ఈ పోర్టల్‌లో పక్కాగా నమోదు చేయాలని, నమోదు చేసిన వివరాలు పక్కాగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌వో కె.రాణి, డీఐవో రెడ్డి అచ్చుతకుమారి తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖరావుకు డాక్టరేట్

విజయనగరం అర్బన్: ఆంధ్ర యూనివర్సిటీ జర్నలిజం విభాగం పరిశోధక విద్యార్థి, సాలూరుకు చెందిన రేగాన షణ్ముఖరావుకు డాక్టరేట్ లభించింది. ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్‌మూర్తి పర్యవేక్షణలో 'డిఫ్యూజన్ ఆఫ్ ఇన్నోవేషన్ అమోంగ్ షెడ్యూల్ క్యాస్ట్ పాపులేషన్–ఏ స్టడీ ఆఫ్ మోసూరు విలేజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు కూడా అందుకున్నట్లు షణ్ముఖరావు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం షణ్ముఖరావు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమాచార పౌర సంబంధాల శాఖలో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్‌ఓ)గా విధులు నిర్వహిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు

విజయనగరం టౌన్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయానికి పోటెత్తిన భక్తులు పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం అమ్మవారికి వివిధ పుష్పాలు, గాజులతో అలంకరించారు. పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..



నెల్లిమర్ల నగరపంచాయతీ ప్రధాన రహదారిలో కాలువ ద్వారా వెళ్లాల్సిన మురుగునీరు.. అదే రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువ పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోవడంతో రోడ్డు మీదికి మురుగునీరు వచ్చేస్తోంది. రోజుల తరబడి ఇలాగే మురుగు ఉంటుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటువైపుగా వెళ్తున్న వారంతా దుర్వాసన భరించలేకపోతున్నామని, ముక్కు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. మొయిద జంక్షన్ నుంచి జరజాపుపేట వెళ్లే దారిలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –నెల్లిమర్ల

ఆక్రమణలు తొలగించండి



భోగాపురం మండలం, రాజాపులోవ గ్రామ శ్మశానవాటికలోని ఆక్రమణలు తొలగించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు కిలారి వెంకటరమణ కోరారు. ఇదే విషయమై ఆయన పలువురు గ్రామస్తులతో కలిసి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దారు హరిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఆరు కులాల వారికి అదొక్కటే శ్మశానవాటిక అని అలాంటిది ఆక్రమణకు గురైతే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఇటీవల శ్మశానవాటికను కొంతమంది ఆక్రమించగా దీనిపై ఫిర్యాదు కూడా చేశామని అయినా చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆక్రమణలు గుర్తించి, తొలగించాలని లేకుంటే కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. –భోగాపురం

పరిసరాల పరిశుభ్రతతో 'డెంగీ' దూరం



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగీ వ్యాధిని దూరం చేయవచ్చని వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా పూసపాటిరేగలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డెంగీ ఎలా వస్తుంది.. నివారణ చర్యలు ఏమిటన్న విషయాలను వైద్యాధికారి తెలిపారు. మురుగునీటి నిల్వలు, అపరిశుభ్ర వాతావరణం దోమలకు నిలయాలు అని, దోమల ద్వారానే డెంగీ ప్రబలుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. దోమలు లేకుంటే డెంగీతో పాటు మలేరియా, చికెన్‌గున్యా కేసులు సైతం లేకుండా చేయవచ్చన్నారు. –పూసపాటిరేగ

రోడ్డు ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన



లారీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామ సమీపంలో గల శారద మెటల్స్ అండ్ స్టీల్స్ ఎల్లాయిస్ కర్మాగారంలో రోడ్డు ప్రమాదాల నివారణపై లారీ డ్రైవర్లకు సీఐ షణ్ముఖరావు శుక్రవారం అవగాహన కల్పించారు. కర్మాగారానికి ముడి సరుకు విశాఖపట్నం పోర్టు నుంచి ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువగా లారీలపైన వస్తోంది. కాగా ఈ లారీలు అధిక లోడ్‌లతోను, అతివేగంగా నడుపుతున్నారని ఇది నేరమని సీఐ హెచ్చరించారు. లారీ డ్రైవర్లు మద్యం సేవించి నడిపినా, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తవలస జంక్షన్ మీదుగా రాకపోకలను మంగళ, శుక్ర, శనివారాల్లో సాగించవద్దని సూచించారు. గడిజాల రోడ్డు మీదుగా వెళ్లాలన్నారు. ఆ రోజుల్లో ట్రాఫిక్ ఎక్కువగా వుండడం వలన గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కర్మాగార ప్రతినిధులు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

భూముల వివరాల పరిశీలన



దెందేరు రామాలయంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో

కొత్తవలస: అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాల వర్తింపు కోసం రైతులకు సంబంధించిన భూముల వివరాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నట్టు ఏవో కె.మాధురీశరణ్య తెలిపారు. మండలంలోని మిందివలస, రామచంద్రాపురం, దెందేరు గ్రామాల్లో జరుగుతున్న పరిశీలన కార్యక్రమాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాలు వర్తింపుకు రైతులు తమ భూముల యొక్క 1 బీ, ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్లతో సమీపంలో గల రైతు సేవా కేంద్రాల్లో పరిశీలన చేసుకొని నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం అన్ని పత్రాలను జత చేసి నమోదు చేయాలని సూచించారు. కౌలు రైతులు తాము సాగు చేస్తున్న భూముల వివరాలను రెవెన్యూ కార్యదర్శులకు తెలిపి కౌలు కార్డులు పొందాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె.లక్ష్మి, కె.హేమ పాల్గొన్నారు.

